## చిన్న కథ

# సపోర్టింగ్ సిస్టమ్



ఆస్పత్రి మంచంమీద స్పృహ లేకుండా శవాకారంగా పడుకుని ఉన్న అరవై ఏళ్ల మంత్రి సుందరరామయ్యను చూస్తూ ఉంటే అందరి గుండెలూ చెరువులయ్యాయి. ఆయనకు వచ్చిన కష్టాన్ని, ఆయన బాధ, ఆవవేదనలను టీవీల్లో చూపెడుతుంటే ఆయనకు ఓటేసి గెలిపించి మంత్రిని చేసి ఆయనపైనే ఆశలన్నీ పెట్టుకున్న నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు, మద్దతు దారుల కళ్లు జలపాతాలయ్యాయి.

వీటన్నింటినీ చూసిన ఓ సగటు మనిషి 'ఈ నీళ్లన్నీ పనికొచ్చేలా ఉంటే కరువనేదే లేకపోయి వుండేదని' దీర్ఘంగా నిట్టూర్చాడు.

వీళ్ల పరిస్థితి ఇలా ఉంటే ఇక సుందరరామయ్య భార్య, కొడుకు, కూతుళ్ల సంగతి, బంధువర్గం సంగతి చెప్పనవసరం లేకుండా ఉంది. మంత్రిగా వున్న ఆయనకు గుండెపోటుతో పాటు సెరిబ్రల్ హేమరేజ్ రావడం వారికెంతో దిగ్భ్రాంతిని కలిగించింది. ఆ దిగ్భ్రాంతికి కారణం ఆయనెప్పుడూ ఆ రెండు అవయవాలను ఉపయోగించకపోవడమే.

సుందర రామయ్య కోడెవయసులో ఉన్నప్పుడు మట్కా, జూదాల్లాంటి 'క్రీడలను' బహు చాకచక్యంగా నిర్వహించేవాడు. పోలీసులు తీసుకెళ్లి 'తమదైన బాణీ'లో గౌరవించి పంపినప్పుడల్లా తానే ప్రధానినైతే మట్కా, జూదాలను ఏసియన్ క్రీడల స్థాయిలో నిర్వహించి వుండేవాడిననుకున్నాడు. తాను ఆ స్థాయికి చేరుకుంటే తప్పక మట్కాను ఏసియన్ క్రీడల్లో పరిచయం చేయాలని ప్రతిన బూనాడు.

మట్కాలో మోసాలు చేసి బాగా సంపాదించిన తరువాత నెమ్మదిగా చిన్నచిన్న కాంట్రాక్టుల్లోకి దిగడం మొదలెట్టాడు. కాంట్రాక్టు పనుల్లో ఏమీ జరగడం లేదని ఎవరైనా అంటే నలుగుర్తో తన్నించడం మొదలెట్టాడు. దీంతో గ్రామంలో సుందరరామయ్య అంటే కొందరికి భయం, మరికొందరికి భక్తి భావం, గౌరవం ఏర్పడ్డాయి. తరువాత్తరువాత అతను స్థానిక అధికారులను నయానో భయానో లొంగదీసుకుని పెద్ద కాంట్రాక్టులను పట్టి చేసిన ప్రజాసేవతో సంతృప్తి చెందక మరింత ప్రజా సేవ చేయడానికి ఎన్నికల్లో దిగి ఎమ్మెల్యే టికెట్టును సాధించుకున్నాడు. ప్రజలకు ఎలాంటి కష్టం కలగకుండా తన అనుచరులతోనే రిగ్గింగ్ చేయించాడు. అ రకంగా తొలిసారిగా ప్రజాసేవ చేసి ఎమ్మెల్యే అయ్యాడు.

రెండుసార్లు వరుసబెట్టి టికెట్టిచ్చిన పార్టీ అధికారంలోకి రాలేదు. దీంతో ఆయన తన పార్టీ ప్రజాసేవ చేయడం లేదని, పాలక పార్టీనే ప్రజాసేవ చేస్తున్నందుకే గెలుస్తోందని గుర్తించి అందులో చేరిపోయాడు. ఆయన ప్రతిభా పాటవాలను, పలుకుబడిని గుర్తించిన ముఖ్యమంత్రి ఆయనకు మంత్రి పదవి ఇచ్చాడు. మొదట్లో మంత్రి పదవి సంతృప్తికరంగా అనిపించినా అదంత ప్రాధాన్యత కలిగిన శాఖ కాకపోవడంతో పార్టీలో ముఠాలను కూడగట్టే ప్రయత్నం చేశాడు. దీనికి బెదిరిన ముఖ్యమంత్రి ఆయనను బుజ్జగించి హోంశాఖను అప్పగించాడు.

సుందరరామయ్యకు ముఖ్యమంత్రి పదవిమీదే కన్నున్నా ముఖ్యమంత్రి తనకన్నా తెలివైన వాడు కావడంతో అసంతృప్తిగానైనా హోంశాఖలోనే కొనసాగడం ప్రారంభించాడు. ఎలాగైనా తను ముఖ్యమంత్రిని అయి తీరతానన్నది ఆయన నమ్మకం.

అలాంటి సుందరరామయ్యకు హఠాత్తుగా గుండెపోటు, సెరిబ్రల్ హెమరేజ్ రావడం అయననే నమ్ముకున్న వారందర్నీ, ఆయననూ కలవరపరచింది. ఆయన్ను హుటాహుటిన రాజధానిలోని పేరుమోసిన కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. ఆయనకు ప్రత్యేకమైన గదిని కేటాయించి డాక్టర్లు ఇళ్లకెళ్లడం మాని ఆయన చుట్టూ వుండడం మొదలుపెట్టారు. అయినా ఏం ఉపయోగం లేకుండా పోయింది. కోమాలాంటి స్థితిలో వున్న సుందరరామయ్య కనీసం కళ్లు కూడా తెవరడం లేదు.

రోజులు గడచి నెలల్లో పడ్డాయి. ఆయన చుట్టూ ఇంతకు ముందులా డాక్టర్లు కొలువుండడం మానేశారు. అయితే రోజుకు ఐదారుసార్లు మాత్రం చూసి వెళుతున్నారు. నలుగురైదుగురు 'సిస్టర్స్' మాత్రం వంతులవారీగా ఆయనకు కాపలా వుంటూ ఆయన ప్రాణం పోకుండా చూస్తున్నారు. ఆయన ఆరోగ్యం వార్తలు రోజూ పత్రికల్లో వస్తూనే వున్నాయి. మొదట్లో ఆసక్తిగా చదివిన జనం చివరికి పట్టించుకోవడం మానేశారు. భార్యాపిల్లలకు కూడా విసుగు ప్రారంభమైంది.

అయితే వీరందరికీ తెలియని విషయం వొకటుంది. సుందరరామయ్య ఏరోజు పరిస్థితి ఎలా వుంటుందోనని భయపడి తన అధికార స్విట్జర్లాండ్ పర్యటన సందర్భంగా మూడవ కంటికి తెలియకుండా స్విస్ బ్యాంకులో మూడువేల కోట్లను దాచిపెట్టారు. ఆయన కదలలేని,కళ్లు తెరవలేని స్థితిలో వున్నా చుట్టూ ఏం జరుగుతోందో తెలుస్తూనే ఉంది. తన స్విస్ బ్యాంకు ఖాతా విషయాన్ని, అకౌంట్ నెంబర్ను కుటుంబానికి చెప్పాలన్న కోరిక ఆయన్లో మిగిలిపోయింది. అయితే ఎంత ప్రయత్నించినా వీలుకాలేదు. మొదట్లో తాను ఆస్పత్రిలో చేరగానే తనచుట్టూ డాక్టర్లు మూగిన విషయాన్ని గమనించి గర్వపడ్డాడు. ఆనక వాళ్లంతగా పట్టించుకోకపోవడం చూసి 'నేను కోలుకున్నాక మీ పని పడతాను' అనుకున్నాడు.

అయితే అవేవీ జరగలేదు. చివరకు భార్యా పిల్లలు కూడా రావడం మానేసే సరికి ఖంగుతిన్నాడు.

ఓ రోజు రాత్రి ఇద్దరు సిస్టర్స్ ఆయన వున్న గదిలోకి వచ్చారు. వారిలో ఓ సిస్టర్ "ఏమిటే ఈ పీడ.. ఇప్పటికి నాలుగు నెలలవుతోంది. ఇంకెప్పుడు ఈ లైఫ్ సపోర్టింగ్ సిస్టం తీసేస్తారు. మనకీ పడిగాపులు తప్పేదెప్పుడు..? కొడుక్కి ముసలాడిపైన ప్రేమ ఉన్నట్టుంది." అంది.

"అసలు సంగతి అదికాదు. ఎన్నికలు దగ్గరికి వచ్చే వరకూ అలా బ్రతకనివ్వమని,అపుడు వీడు చస్తే సానుభూతి ఓట్లతో గెలవొచ్చని కొడుకు అనుకుంటున్నాడు. అందుకే ఇలా వుంచాడు. లేకపోతే ఈ సరికే పైలోకంలో ఉండేవాడు" అంది మరో సిస్టర్.

అంతే.. షాక్ తిన్న సుందరరామయ్య ప్రాణం హాస్పిటల్ వాతావరణాన్ని దాటింది.

– సునీత